అక్రమ నిర్మాణాల జోరు.. అధికారుల మౌనం!

- నాగోల్ సర్కిల్, పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లో భారీ షెడ్ల నిర్మాణాలపై ఆరోపణలు
- 2022 నుంచి ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదంటున్న స్థానికులు
- నిర్మాణాలపై సమగ్ర విచారణ జరపాలి: స్థానిక నేతలు



దశ , పెద్ద అంబర్ పేట : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోన్ పరిధిలోని నాగోల్ సర్కిల్, పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లో అనుమతులు లేకుండా భారీ షెడ్లు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పెద్ద అంబర్‌పేట్‌లోని సర్వే నంబర్ 266 పరిధిలో ప్లాట్లకు సంబంధించి డబుల్ లేఅవుట్ వివాదం ఉండటంతో ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అనుమతులకు సంబంధించిన స్పష్టత లేకుండానే నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2022 నుంచి ఫిర్యాదులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తట్టి అన్నారం, అన్నవరం కాలనీల్లో భారీ షెడ్లు

పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లోని తట్టి అన్నారంలో జీవీఆర్ కాలనీకి వెళ్లే రహదారి సమీపంలో భారీ షెడ్డు నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అన్నవరం సత్యనారాయణ స్వామి కాలనీలోనూ రెండు భారీ షెడ్లు నిర్మించారని, వాటికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అన్నది అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు. ఫిర్యాదులపై చర్యలు తీసుకోకపోవడానికి కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు.



ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా?

భవన నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా? అనుమతులకు సంబంధించిన ఫీజులు చెల్లించారా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

అధికారులపై విచారణ జరపాలి

పెద్ద అంబర్‌పేట్‌లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యంజాల ప్రహ్లాద్ ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఫిర్యాదులపై పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని, ఏళ్ల తరబడి సమస్యను పరిష్కరించడం లేదని విమర్శించారు. అక్రమ నిర్మాణాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తట్టి అన్నారం, అన్నవరం సత్యనారాయణ స్వామి కాలనీలతో పాటు డివిజన్‌లోని ఇతర నిర్మాణాల అనుమతులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

ఫామ్‌హౌస్‌లపై పోలీసుల మెరుపు దాడులు

- 26 లీటర్ల మద్యం, నాలుగు హుక్కా పాట్స్ స్వాధీనం
- యజమానులు, పార్టీ నిర్వాహకులపై కేసులు.



దశ, మొయినాబాద్ : మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ఫామ్‌హౌస్‌లపై పోలీసులు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో 26 లీటర్ల మద్యం, నాలుగు హుక్కా పాట్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఎస్‌హెచ్‌ఓ వై. మల్లికార్జునరెడ్డి, డీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు తనిఖీలు చేపట్టాయి. తోలుకట్టలోని వన్ వ్యూ, వనం, ప్రణవిల్లా ఫామ్‌హౌస్‌లతో పాటు సురంగల్‌లోని జెడ్, రాయల్ వుడ్ ఫామ్‌హౌస్‌లలో సోదాలు నిర్వహించారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఫామ్‌హౌస్ యజమానులు, పార్టీ నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

నర్సంపేట నెహ్రూ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం.. బాధితులను ఆదుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్



దశ, నర్సంపేట: పట్టణంలోని అంగడి సెంటర్ నెహ్రూ విగ్రహ సమీపంలో తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు పూర్తిగా దగ్ధమై, సుమారు రూ.90 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఘటనా స్థలాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్లు బానోత్ నవీన్ నాయక్, కీర్తి దుశ్వంత్ రెడ్డి, బుస శిరీష రాజు సందర్శించి బాధితులను పరామర్శించారు. గత నెల రోజులుగా పట్టణంలో విద్యుత్ కోతలు, అంతరాయాలు తీవ్రమయ్యాయని, అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు ఆరోపించారు. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ జరిపి విద్యుత్ వ్యవస్థలను తనిఖీ చేయాలని, ఎమ్మెల్యే వెంటనే బాధితులను పరామర్శించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత వ్యాపారులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.




స్వర్ణకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలి
- కార్పొరేట్ సంస్థల పోటీ నుంచి సంప్రదాయ వృత్తిని కాపాడాలి

దశ, ఎల్బీనగర్: స్వర్ణకార వృత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు వృద్ధాప్య పింఛన్లు, ఆరోగ్య కార్డులు అందించాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వర్ణకారుల వృత్తి పరిరక్షణ కోసం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం రాత్రి నిర్వహించిన స్వర్ణకార శంఖారావం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీవో నంబర్ 272ను సవరించాలని రాఘవచారి కోరారు. 50 ఏళ్లు నిండిన స్వర్ణకారులకు నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ సంస్థల పోటీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంప్రదాయ స్వర్ణకార వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. మాజీ స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులవృత్తులు కనుమరుగవుతున్న నేపథ్యంలో వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. బహుజన రాజ్య సాధనకు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు తెలంగాణలోని 33 జిల్లాల నుంచి స్వర్ణకార సంఘం కార్యవర్గ సభ్యులు, నాయకులు హాజరయ్యారు.

ఐకేపీ కేంద్రం అభివృద్ధికి వారాహి ఆగ్రో ఇండస్ట్రీస్ సహకారం



- యాజమాన్యానికి గ్రామ పంచాయతీ, మార్కెట్ అభివృద్ధి కమిటీ ఘన సన్మానం
- రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం: సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం

దశ, రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం అభివృద్ధికి సహకరించిన వారాహి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యాన్ని గ్రామ పంచాయతీ పాలకవర్గం, మార్కెట్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఐకేపీ కేంద్రం స్థలం చదునుగా లేకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన వారాహి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యం గత 12 రోజులుగా యంత్రాలతో స్థలాన్ని చదును చేయించింది. దీంతో ధాన్యం కొనుగోళ్లకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా సహకారం అందించింది. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ రైతులకు మార్కెట్ సౌకర్యాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ముందుకొచ్చిన వారాహి ఆగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యం సేవలు అభినందనీయమన్నారు. రైతుల ప్రయోజనాల కోసం సహకరించిన యాజమాన్య ప్రతినిధులకు గ్రామ ప్రజలు, రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్ల క్రాంతి కుమార్, మార్కెట్ అభివృద్ధి కమిటీ గౌరవ సభ్యులు మామిడి పద్మారెడ్డి, కట్ట యాదయ్య, తాళ్లపల్లి జితేందర్, మామిండ్ల అశోక్, తాళ్లపల్లి దుర్గయ్య, మామిడి పాండురెడ్డి, తొలుపునూరి చంద్రశేఖర్, ఏలూరి రవి, ఎండీ నజీరొద్దీన్, భాషపాక యాదయ్య, వార్డు సభ్యులు యాదాసు లక్ష్మణ్, మేకల రాములు, వారాహి ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధులు నంబూరి కిరణ్, చంద్రన్న, తరుణ్, మార్కెట్ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు


- రెండు రోజుల్లో గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
- ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



దశ, నాగోల్ : తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు అందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని గుర్తింపు కమిటీ సభ్యులు మోతే శోభన్ రెడ్డి, రాములు నాయక్ వెల్లడించారు. అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. నాగోల్‌లోని శుభంకన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అలయ్ బలయ్ ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. మరో రెండు రోజుల్లో గుర్తింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, ఉచిత బస్సు పాస్‌లు, ఆరోగ్య కార్డులు అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవీప్రసాద్, పల్లె రవికుమార్ గౌడ్, ఏపూరి సోమన్న, రంగారెడ్డి, పల్లె వినయ్ కుమార్ గౌడ్, బీరెల్లి వెంకట్ రెడ్డి, ఉప్పల శ్రవణ్, కొత్త రవి, ఇరుగు శ్రీధర్, పిడికిలి రాజు, గుజ్జ సత్యం, బొమ్మ రఘురాం నేత తదితరులు పాల్గొన్నారు.

చిరుమర్తి లింగయ్య రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు


- పలివాడ ఘటనపై కాంగ్రెస్ నాయకుల విమర్శలు
- అమాయక కుటుంబానికి న్యాయం చేయాలి: గంగుల వెంకటరాజి రెడ్డి



దశ, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పలివాడ గ్రామంలో జరిగిన ఘటనపై మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వ్యవహారశైలిని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా పోలీసులపై, కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. స్థానిక సుభాష్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు గంగుల వెంకటరాజి రెడ్డి మాట్లాడుతూ పలివాడలో యాదవ కుటుంబానికి చెందిన మహిళపై గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు ఖమ్మంపాటి శ్రీనివాస్ గౌడ్ దాడికి పాల్పడ్డారంటూ ఆరోపించారు. దుర్గామాత నిమజ్జనం సందర్భంగా చోటుచేసుకున్న ఘటనపై నిజానిజాలు తెలుసుకోకుండా చిరుమర్తి లింగయ్య రామన్నపేట పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజల పక్షాన నిలబడి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్ మాట్లాడుతూ చిరుమర్తి లింగయ్య గతంలో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయంగా ఎదిగిన విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించారు. అమాయక ప్రజలపై గతంలో కేసులు పెట్టించిన చరిత్రను కూడా పరిశీలించుకోవాలని విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి

- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- 108 కేసుల దర్యాప్తుపై ఫ్యూచర్ సిటీ సీపీ సమీక్ష



దశ, ఇబ్రహీంపట్నం: ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని 108 కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దర్యాప్తులో జాప్యాన్ని నివారించి, కేసులకు సంబంధించిన పక్కా ఆధారాలను సేకరించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో మహేశ్వరం డీసీపీ కె. నారాయణ రెడ్డి, చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, షాద్‌నగర్ డీసీపీ శిరీష, అదనపు డీసీపీ షేక్ జహంగీర్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ఎం. హుస్సేనీ నాయుడు, ఇతర ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన కోటమైసమ్మ జాతర



దశ, హైదరాబాద్: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో నిర్వహించిన శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర ప్రశాంతంగా ముగిసింది. వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాతరను విజయవంతంగా నిర్వహించడంలో కీలకంగా వ్యవహరించారు. సింగరేణి సీఐ నునావత్ సాగర్ ఆధ్వర్యంలో, ఎస్ఐ బైరు గోపి పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించారు. జాతరలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వాహనాల పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. భక్తుల రద్దీని నియంత్రిస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా రాత్రింబవళ్లు బందోబస్తు నిర్వహించారు. 24 గంటలపాటు పోలీసులు అందుబాటులో ఉంటూ భక్తులకు భరోసా కల్పించారు. పటిష్టమైన భద్రతా చర్యలతో జాతర సజావుగా ముగియడంతో భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అంకితభావం చూపిన సీఐ నునావత్ సాగర్, ఎస్ఐ బైరు గోపి సహా పోలీసు సిబ్బందిని అభినందించారు.

దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ కోసం మహాయజ్ఞం

❖ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక హోమాలు.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి: పుష్పగిరి పీఠాధిపతి



దశ ఓయూ: హైదరాబాద్ నాచారం మల్లాపూర్‌లోని వివిఆర్ గార్డెన్‌లో దేశ రక్షణ,ధర్మపరిరక్షణ సంకల్పంతో మూడు రోజుల పాటు మహాయజ్ఞం నిర్వహించారు. హిందూ ధర్మ చక్రం వ్యవస్థాపకులు మద్దికుంట్ల శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక యజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా శ్రీ జగద్గురు పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామివారు మాట్లాడుతూ.. దేశ రక్షణ, ధర్మ పరిరక్షణ కోసం రుద్ర, చండీ, అరుణ హోమాలతో పాటు లలితా సహస్రనామ హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా చేపట్టిన ఈ యజ్ఞం ద్వారా దేశానికి శాంతి,సుభిక్షం కలగాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. ధర్మ పరిరక్షణ, దేశ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నీటి కుంటలో మునిగి ముగ్గురి మృతి



దశ, హైదరాబాద్ : బతుకుదెరువు కోసం వలస వచ్చి జీవనం సాగిస్తున్న కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. నీటి కుంటలో మునిగి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఖమ్మం మండలం మంగళగూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు ఉపాధి కోసం ఇందారంలోని కాసింపేట ప్రాంతానికి వచ్చాయి. అక్కడ గుడారాలు ఏర్పాటు చేసుకుని గ్యాస్ స్టవ్‌ల మరమ్మతులు చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం అదే కుటుంబాలకు చెందిన మోటం మణియమ్మ (24), మోటం కీర్తన (16), మదేని కావ్య (9) బట్టలు ఉతికేందుకు సమీపంలోని నీటి కుంట వద్దకు వెళ్లారు. చాలాసేపైనా వారు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూశారు. కుంట ఒడ్డున చెప్పులు, బట్టలు కనిపించడంతో అనుమానం వచ్చి నీటిలో గాలించగా ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల్లో మణియమ్మ, కీర్తన వదినా మరదళ్లు కాగా, కావ్య మణియమ్మకు వరుసకు చెల్లెలు అవుతుంది. మణియమ్మ కుటుంబం శనివారమే పెద్దపల్లి నుంచి ఇందారానికి వచ్చినట్లు తెలిసింది. కొత్త ప్రాంతం కావడంతో నీటి కుంట లోతును అంచనా వేయలేక ప్రమాదానికి గురై ఉండవచ్చని భావిస్తున్నారు.

కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీలు

దశ, హైదరాబాద్ : భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు, నంబర్ ప్లేట్లు లేని మరో 8 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు మొత్తం 150 కేసులు నమోదు చేసి రూ.36,390 జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ అరుణ్‌కుమార్ కాలనీవాసులతో మాట్లాడారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కలవర పెడుతున్న టీనేజ్ ప్రెగ్నెన్సీ



❖ రాష్ట్రంలో వికారాబాద్ టాప్

❖ ఈ వయసులో కాన్పు మంచిదేనా?

❖ యుక్త వయసులో గర్భం దాల్చడం వల్ల అనారోగ్యం -తల్లీతో పాటు బిడ్డకు అనేక ఇబ్బందులు

❖ చదువు ఆగిపోయి కెరీర్ అర్ధంతరంగా ముగుస్తుంది

❖ చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల బరువు తక్కువ పిల్లలు పుట్టే అవకాశం

దశ,తాండూర్ ప్రతినిధి

బాల్య వివాహాలు, తెలిసీ తెలియని వయసులో క్షణికావేశం, అత్యాచారాలు.. ఇలా యుక్త వయసులో ఉన్న అమ్మాయిలు గర్భం దాల్చడానికి (టీన్ ప్రెగ్నెన్సీ) కారణాలు అవుతున్నాయి. అయితే టీనేజ్‌లోనే గర్భధారణ వల్ల తల్లితో పాటు బిడ్డకి ఆరోగ్యపరంగా ఎన్నో సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే ముఖ్యంగా బాల్య వివాహాల్ని నిర్మూలించాలని అంటున్నారు. దీంతో పాటు ప్రత్యుత్పత్తి వ్యవస్థ, లైంగిక ఆరోగ్యం, టీన్ ప్రెగ్నెన్సీ వంటి విషయాలపై చిన్నతనం నుంచే అమ్మాయిల్లో అవగాహన కలిగించాలని సలహా ఇస్తున్నారు.

టీన్ ప్రెగ్నెన్సీ అంటే?

13 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారిని టీనేజ్ అంటారు. ఈ సమయంలో గర్భం ధరించిన అమ్మాయిల్ని టీన్ ప్రెగ్నెంట్'గా పరిగణిస్తారు. మన దేశంలో ఈ సమస్య కాస్త తీవ్రంగానే ఉందని నిపుణులు చెబుతున్నారు. ఏటా సుమారు 1.6 కోట్ల మంది బాలికలు చిన్న వయసులోనే (1519) తల్లులవుతున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఇబ్బందులు ఎన్నెన్నో

టీనేజ్‌లో గర్భం దాల్చడం వల్ల చాలా శారీరక, మానసిక సిద్ధం కాకపోవడం వల్ల అనేక మార్పులు జరుగుతుంటాయని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ నీలిమ చెబుతున్నారు.

ముఖ్యంగా గర్భాశయం లాంటి శరీరంలోని కొన్ని వ్యవస్థలు సిద్ధం కాకపోవడం వల్ల ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇంకా కొందరిలో అయితే, అబార్షన్ కూడా చేయాల్సిన అవసరం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కొందరిలో ఇన్‌ఫెక్షన్లు సోకి సైడ్ ఎఫెక్ట్ వస్తాయని తెలిపారు. ఇంకా పిండం ఎదుగుదల సరిగ్గా లేక మిస్ క్యారేజ్, నెలల నిండకుండానే ప్రసవం జరుగుతుందని వెల్లడిస్తున్నారు. కొందరిలో 9నెలల వచ్చి నొప్పులు వస్తున్నా.. కాన్పు ఆలస్యం అవతుందంటున్నారు.

టీనేజ్‌లో చాలా మందిలో ఉండే రక్తహీనత,పోషకాహారం లోపం సమస్యలతో ప్రసవం సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల తల్లికి, పుట్టబోయే బిడ్డకు ప్రమాదం ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు.అందుకే వీలైనంత వరకు టీనేజ్ ప్రెగ్నేన్సీకి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. కనీసం 20 ఏళ్లు దాటిన తర్వాత ప్రసవం వల్ల తల్లితో పాటు బిడ్డ సురక్షితమని చెబుతున్నారు.



ఓవైపు 30 ఏళ్లు దాటిన నో పెళ్లి

ఓ వైపు బాగా చదువుకున్న అమ్మాయిలు 30 ఏళ్లు దాటినా పెళ్లి చేసుకోవడం లేదు. దీనికారణంగా 40 దాటే వరకూ పిల్లలు కలగక ఫెర్టిలిటీ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు పదహారేళ్లు నిండకముందే కొందరు అమ్మాయిలు తల్లులవుతున్నారు. పరస్పర ఈ వైరుధ్యం పలువురు వైద్యులు, నిపుణులను విస్మయపరుస్తున్న అంశం. ప్రభుత్వ,ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలకు వస్తున్న గర్భిణుల్లో 3 శాతానికి పైగా మైనర్ అమ్మాయిలు వస్తున్నట్లు తేలింది.

రాష్ట్రంలో వికారాబాద్ టాప్

బాల్యవివాహాల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన నాలుగు నెలల్లో వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 458 మంది మైనర్ అమ్మాయిలు గర్భం దాల్చారు. ఇందులో 16 ఏళ్లలోపు అమ్మాయిలు 107 మంది ఉండటం ఆందోళన కలిగిస్తోంది. రంగారెడ్డి జిల్లాలోనూ టీనేజీ ప్రెగ్నెన్సీలు నమోదయ్యాయి. మొత్తం ప్రసవాల్లో 3.23 శాతం మైనర్లవే కావడం గమనార్హం. సామాజిక మాధ్యమాల ప్రభావంతో మైనార్టీ తీరని అమ్మాయిలు ప్రేమ-పెళ్లి బాట పడుతున్నారు.

ప్రతిబంధకంగా బాల్య వివాహాలు

గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయి అంటేనే భారంగా భావిస్తున్నారు. అందుకే 15 ఏళ్లకే పెళ్లి చేస్తున్నారు. తాండూరు, వికారాబాద్ ,పరిగి, కొడంగల్ ,బొమ్మరేస్పేట్ ,బంటివారం ,మర్పల్లి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయి. పదో తరగతి చదువుతూండగానే పెళ్లి చేస్తున్నారు. బాగా చదువుకుని కెరీర్‌లో స్థిరపడాల్సిన సమయంలో వారికి పెళ్లి తీవ్ర ప్రతిబంధకంగా మారుతోంది.

నిఘా పెట్టినా ఆగడం లేదు



స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాలను అడ్డుకుంటున్నా మరోవైపు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. బాల్యవివాహాలు కుదిర్చిన పెద్దలు, ఇరువురు తల్లిదండ్రులకు కఠిన శిక్షలు పడే అవకాశమున్నా కొన్నిప్రాంతాల్లో అడ్డూ అదుపూ లేకుండా పోయింది. చైల్డ్‌లైన్ 1098, హెల్ప్‌లైన్ 181, డయల్ 100కు ఫోన్ చేస్తే పెళ్లిళ్లు ఆపేస్తారు. దీన్ని వినియోగించుకోవాలని ఐసీడీఎస్ అధికారులు కోరుతున్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్నాం

కొన్ని ప్రాంతాల్లో 15 ఏళ్లు దాటగానే అమ్మాయిలను తల్లిదండ్రులు భారంగా భావిస్తున్నారు. ముందస్తుగా పెళ్లి చేసి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నారు. మరికొన్ని చోట్ల సామాజిక మాధ్యమాలకు ప్రభావితమై యువతీ యువకులు పెళ్లి చేసుకుంటున్నారు. ఇటీవలి కాలంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్‌ల ప్రభావం ఎక్కువైంది. పలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

–శ్రీదేవి, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐసీడీఎస్



పరీక్ష పెట్టి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు భర్తీ చేయాలి



❖ డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించాలి.. జీవో నం. 4, 31 రద్దు చేయాలి

❖ నిరుద్యోగ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ డిమాండ్

దశ, ఓయూ: డిగ్రీ లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలను అకడమిక్ మార్కుల ఆధారంగా కాకుండా రాతపరీక్ష నిర్వహించి భర్తీ చేయాలని నిరుద్యోగ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వద్ద నిరుద్యోగులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరగాలంటే రాతపరీక్షతో పాటు డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించాలని కోరారు.

పాత నియామక విధానాన్నికొనసాగించాలి

అకడమిక్ మార్కులకు 50, డెమోకు 30, ఇంటర్వ్యూకు 20 మార్కులు కేటాయించి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలను భర్తీ చేసే విధానంతో అర్హులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని అశోక్ పేర్కొన్నారు. జీవో నం. 4, 31లను రద్దు చేసి, స్క్రీనింగ్ టెస్టు ద్వారా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి, డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలను కూడా గతంలో మాదిరిగా రాతపరీక్ష నిర్వహించి భర్తీ చేయాలని కోరారు.

డిగ్రీ, పీజీ చదువుల్లో అసైన్‌మెంట్లకు మార్కులు కేటాయిస్తున్నందున ఇటీవల చదివిన అభ్యర్థులకు ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉందని, పదేళ్ల క్రితం పీజీ పూర్తి చేసిన సీనియర్ అభ్యర్థులకు తక్కువ మార్కులు రావచ్చని వివరించారు. దీంతో అనుభవం, అర్హతలు ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరిగే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇతర రాష్ట్రాల్లో పరీక్షల ద్వారానే నియామకాలు

ఆంధ్రప్రదేశ్‌లో డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలకు 150 ప్రశ్నలతో, 300 మార్కులకు పరీక్ష నిర్వహించి నియామకాలు చేపట్టినట్లు అశోక్ తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు కూడా స్క్రీనింగ్ టెస్టు ద్వారా ఎంపిక చేస్తున్నారని పేర్కొన్నారు. తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ పరీక్షల ద్వారానే నియామకాలు చేపడుతున్నారని వివరించారు.

తెలంగాణలోనూ పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి అర్హులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, నాగేంద్రచారి, నరసింహగౌడ్, విద్యాసాగర్, సారంగం వెంకటేశం, విన్నర్ చోళ, ప్రణీత్, కిరణ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో తెలంగాణ సత్తా చాటాలి

❖ క్రీడాకారులకు జెర్సీలు అందజేసిన రాష్ట్ర సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి

దశ ఓయూ: జాతీయ స్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని రాష్ట్ర సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు పి. మల్లారెడ్డి ఆకాంక్షించారు. ఈ నెల 30 నుంచి నవంబరు 4 వరకు ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగనున్న 78వ సీనియర్, 55వ జూనియర్, 41వ సబ్ జూనియర్ జాతీయ ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ బాలబాలికల జట్టుకు సంఘం తరఫున ఆయన జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పాటు నిరంతర సాధన అవసరమన్నారు. రాంచీలో జరిగే పోటీలు క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి అవకాశమని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. తెలంగాణ జట్టుకు శుభాకాంక్షలు తెలిపి, పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాట్స్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జి. చంద్రారెడ్డి, అంతర్జాతీయ సైక్లిస్ట్ మ్యాక్స్‌వెల్ ట్రెవర్, రాష్ట్ర సైక్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్‌కాంత్ రావు, కోచ్‌లు విజయ్ భాస్కర్‌రెడ్డి, పాండు జాదవ్, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

